నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: ప్రశాంత్‌నగర్, మయూరినగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ రవి చంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు మయూరినగర్ పార్ట్ టెంపుల్ కాంప్లెక్స్, ఆర్ ఎల్ సిటీ రోడ్డు, వెంకటరాయనగర్, బాలాజీనగర్, ఇంద్రమ్మ కాలనీ ఫేజ్-1,

- 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు వాటర్ ట్యాంకు రిజర్వాయర్ రోడ్డు, కోరుకొండ స్కూల్, ఓల్డేజ్ హోమ్ రోడ్డు, జీఎల్ఆర్ కాలనీ, మయూరినగర్ పార్క్,
- మయూరినగర్ ఫీడర్ పరిధిలో.. 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఏఆర్‌కే టవర్స్, మయూరినగర్ పార్క్, ఎస్‌బిఐ బ్యాంకు రోడ్డు, ఓల్డేజ్ హోమ్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

దరఖాస్తు గడువు పెంపు

'మనూ' అడ్మిషన్ల డైరెక్టర్ ప్రొ. వనజ

రాయదుర్గం: మనూలో 2025-26 విద్యా సంవత్సరంలో మెరిట్ ఆధారంగా వివిధ కోర్సులలో అడ్మిషన్ల దరఖాస్తు గడువు తేదీని పొడిగించినట్లు 'మనూ' అడ్మిషన్ల ప్రొఫెసర్ ఎం వనజ బుధవారం తెలిపారు. జూన్ 19 వరకు గడువును పొడిగించినట్లు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ వర్గాల నుంచి వచ్చిన వినతులను దృష్టిలో పెట్టుకొని గడువు తేదీని పెంచినట్లు ఆమె వివరించారు. పీజీ డిప్లొమో ఇన్ టీచింగ్ ఇంగ్లిష్, నాలుగు పార్ట్ టైమ్ పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమో కోర్సులు, పది పార్ట్‌టైమ్ డిప్లొమో కోర్సు, ఏడు పార్ట్ టైమ్ సర్టిఫికెట్ కోర్సు, డిప్లొమో అండ్ బీఏస్సీ ఇన్ ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ ఇంటీరియర్ డిజైన్‌తో బాటు 24 వివిధ పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులలో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను, ఇతర వివరాల కోసం 040-23006612 ఎక్స్‌టెన్షన్ 1801 లో సంప్రదించాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: హఫీజ్‌పేట్‌కు చెందిన లికియా బేగంకు అత్యవసర చికిత్స నిమిత్తం మంజూరైన రూ.32వేలు చెక్కును బుధవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ బాధిత కుటుంబానికి అందజేశారు. ముఖ్య మంత్రి సహాయనిధి పేదలకు ఆర్థిక భరోసానిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, కరుణాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి తొలగింపు

పాపిరెడ్డి కాలనీ అండర్ బ్రిడ్జి నుంచి రాకపోకలు మరూ..



అండర్ బ్రిడ్జి వద్ద ఇంజన్ ద్వారా నీటిని తొలగిస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ అండర్ బ్రిడ్జి వద్ద వరద నీటిని బీఆర్ఎస్ నాయకులు రవి కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం తొలగించారు. పాపిరెడ్డి నగర్, రాజీవ్ గృహకల్ప, సందయ్యనగర్ వాసుల కోరిక మేరకు ఈ ప్రాంతాన్ని పరిశీలించిన రవికుమార్ యాదవ్ తన స్వంత ఖర్చులతో మోటార్ ద్వారా మురుగు నీటిని తొలగింపజేశారు. దీంతో రాకపోకలు కొనసాగడంతో స్థానికులు రవి కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్



ప్రయాణికుడికి బ్యాగును అందజేస్తున్న డిపో అధికారులు

మియాపూర్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు మరిచిపోయిన బ్యాగును అతనికి అందించి నిజాయితీ చాటుకున్నాడు ఆర్టీసీ డ్రైవర్ ఎండీ. మిర్జా. మియాపూర్ ఆర్టీసీ-2 డిపో పరిధిలోని పుష్పక్ బస్సు అహ్మదాబాద్ నుండి మియాపూర్‌కు వచ్చే బస్సులో అహ్మదాబాద్‌కు చెందిన అభయ్ కుమార్ గిరి బుధవారం ప్రయాణించాడు. జేఎన్‌టీయూ వద్ద బ్యాగును మర్చిపోయి దిగిపోయాడు. కొంతసమయం ద్వారా బస్సు డ్రైవర్ మిర్జా బ్యాగును గమనించి పరిశీలించగా అందులో ల్యాప్‌టాప్, వ్యాలెట్, వివిధ ధ్రువపత్రాలు ఉన్నాయి. ఆర్టీసీ అధికారులు ప్రయాణికుడి ఆచూకీ తెలుసుకుని మేనేజర్ ఎం. వెంకటేశం ప్రయాణికుడికి బ్యాగును అందజేశారు. డ్రైవర్ ఎండీ మిర్జాను సన్మానించారు.

అసలే ఇరుకు.. ఆపై ట్రాఫిక్

ముందుకు సాగని రోడ్డు విస్తరణ పనులు ● ఇదీ హఫీజ్‌పేట్ - కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్ వరకు రోడ్డు పరిస్థితి



సీఆర్ ఫౌండేషన్ వద్ద ఇరుకు రోడ్డులో యూ టర్న్



కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్ వరకు రోడ్డు మధ్యన చెట్లు

చందానగర్: నగరంలో ఐటీ ప్రాంతాలలో పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా జీహెచ్ఎంసీ రోడ్ల విస్తరణ, లింక్ రోడ్లు చేపట్టింది. కొన్నిచోట్ల పనులు పూర్తికాగా మరికొన్ని చోట్ల జాప్యం జరుగుతోంది. చందానగర్ సర్కిల్ 21 పరిధిలో ఇప్పటికే యశోద హాస్పటల్ వద్ద రోడ్డు విస్తరణ పూర్తి చేశారు. కానీ హఫీజ్‌పేట్‌లో మాత్రం ఆలస్యం అవుతోంది. అధికారుల సమన్వయ లోపం వలన రోడ్డు విస్తరణ ముందుకు సాగడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. మియాపూర్, బాచుపల్లి, మదీనాగూడ, హఫీజ్‌పేట్ ప్రాంతాల నుంచి వచ్చే ఐటీ ఉద్యోగులు ఆల్విన్‌కాలనీ చౌరస్తా నుంచి న్యూ హఫీజ్‌పేట్, సీఆర్ ఫౌండేషన్ మీదుగా వెళ్తుంటారు. ఈ క్రమంలో కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్ వద్దకు రాగానే రోడ్డు ఒక్కసారిగా ఇరుకుగా మారింది. రోడ్డు మధ్యలో చెట్లు ఉండడం కూడా ట్రాఫిక్ సమస్యకు కారణమవుతోంది. దీంతో ఉదయం పూట ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా పోలీసులు కొత్తగూడ ఫ్లైఓవర్ మీదుగా వాహనాలను పంపిస్తున్నారు. ఈ రోడ్డు విస్తరణ చేపట్టాలని జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు నిర్ణయించినప్పటికీ సంవత్సరం అవుతున్నా చర్యలు శూన్యం. సుమారు 400 మీటర్ల మేర ఉన్న ఫుట్‌పాత్‌పై భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. అంతేకాకుండా యూటర్న్ ఉండడంతో ఉదయం, సాయంత్రం సమయాలలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. చెట్ల తొలగింపునకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు తదుపరి చర్యలకు పూనుకోవడం లేదు. సమన్వయ లోపం వలన రోడ్డు విస్తరణ జరగడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఫుట్‌పాత్ మీద సుమారు 40 చెట్లు, 10 విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్, తాగునీటి చాంబర్ ఉన్నాయి. వాటి మార్పునకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ట్రాఫిక్ ఉన్నతాధికారులు పలుమార్లు రోడ్డు విస్తరణ చేయాలని కోరినా జాప్యమెందుకు జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది.కాగా ఫుట్‌పాత్‌పై చెట్ల తొలగింపునకు జీహెచ్ఎంసీ ప్రత్యేక కమిటీ సైతం15 రోజుల క్రితం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. కమిటి నివేదిక అందిన వెంటనే చెట్ల తరలింపు పనులు ప్రారంభిస్తామని అధికారులు అంటున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి



కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్ వద్ద రోడ్డు విస్తరణ చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి. ఆగిన పనులు పునఃప్రారంభించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి.
- కృష్ణ, వాహనదారుడు

అధికారుల అలసత్వం



హఫీజ్‌పేట్-కొండాపూర్ వరకు రోడ్డుకు మధ్యలో ఉన్న చెట్ల తొలగింపు ప్రక్రియ అధికారుల సమన్వయ లోపం వలన సాగడం లేదు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పట్టించుకోవాలి.
- సుధాకర్, వాహనదారుడు



చెట్లకు నంబర్లు రాసిన దృశ్యం

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేం

కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



కార్మికులకు సరుకులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: పారిశుద్ధ్య కార్మికులు శుభ్రత కోసం పడే శ్రమ వెలకట్టలేనిదని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డిలోని వార్డు కార్యాలయంలో అమెజాన్ కంపెనీ సహకారంతో సుమారు 200 మంది కార్మికులకు నిత్యావసర వస్తువులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ వారిని గౌరవించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు హన్మంతునాయక్, సుమన్, రాజు, శ్రీను,గోవింద్ జీహెచ్ఎంసీ సిబ్బంది భారత, కిష్టయ్య, మల్లేష్, అమెజాన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

అల్విన్‌కాలనీ: కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రామ్‌నరేష్‌నగర్‌లో సీవరేజ్ లైన్ పనులను అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేయాలన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అన్ని కాలనీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు.



సీవరేజ్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, అధికారులు

కొనసాగుతున్న భారతీయ భాషా సమ్మర్‌క్యాంప్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్ట్రక్టర్ రాజ్యలక్ష్మి

రాయదుర్గం: కేంద్రీయ విద్యాలయాల్లో భారతీయ భాషా సమ్మర్ క్యాంప్‌లు విజయవంతంగా సాగుతున్నాయని గచ్చిబౌలి కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ తెలిపారు. గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో నిర్వహిస్తున్న క్యాంప్‌ను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ వరకు ఈ క్యాంప్ కొనసాగుతుందని, ఇతర భాషల విద్యార్థుల కోసం ఈ క్యాంపును నిర్వహిస్తున్నామని, 100 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని వివరించారు.

బుల్కాపూర్ నాలా కబ్జాలపై హైడ్రాకు ఫిర్యాదు

మణికొండ: బుల్కాపూర్ నాలాను పలు ప్రాంతాల్లో కబ్జా చేస్తున్నారంటూ మణికొండ వాసులు హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుని నాలాను పరిరక్షించాలని కోరుతూ హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ, మణికొండ రెవెన్యూల పరిధిలో వెలసిన కొన్ని కాలనీలవాసులు లేఅవుట్‌లలో కొంత భూమి కొనుగోలు చేసి మరికొంత నాలా భూమిని ఆక్రమించి తప్పుడు అనుమతులతో నిర్మాణాలు చేస్తున్నారని వివరించారు. నాలా కనుమరుగు అవుతుండటంతో వర్షం నీరు మణికొండ గ్రామంలోకి రావటంతో కాలనీలు ముంపునకు గురవుతున్నాయన్నారు. నాలాతో పాటు బఫర్ జోన్‌ను కనుమరుగు చేస్తున్నారని చెప్పారు. దీంతో సానుకూలంగా స్పందించిన కమిషనర్ త్వరలోనే సమగ్ర నివేదిక తెప్పించి ఆక్రమణలను తొలగిస్తామని హామీ ఇచ్చినట్లు స్థానిక నాయకుడు జి.రామలింగారెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చందానగర్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం రెండు రోజుల క్రితం లింగంపల్లి రైల్వే స్టేషన్ అండర్ బ్రిడ్జి వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి (50) కింద పడిపోయాడు. దీనిని గమనించిన వాహనదారులు వెంటనే చందానగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని పరిశీలించి చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఆ వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కాలనీల్లో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

మోతీనగర్: కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ సామల వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇటీవల డివిజన్ పరిధిలోని తులసినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గెలుపొందిన ఠాకూర్ అంకిత్‌సింగ్ మర్యాదపూర్వకంగా సీఐని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల ఆచూకీని పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో కిషన్ సింగ్, నాథూరామ్, చింటూ, శ్రీకాంత్, జహంగీర్, శివ పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చందానగర్: హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్‌ల పరిధిలో గురువారం రూ.1.60 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి కార్పొరేటర్లు పూజిత గౌడ్, జగదీశ్వర్‌గౌడ్‌లతో కలిసి ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేయనున్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీనగర్‌లో రూ.40 లక్షలు, హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో జనప్రియనగర్ ఫేజ్-2లో రూ.85 లక్షలు, రామకృష్ణనగర్, ప్రజయ్‌సిటి కాలనీలలో రూ.35 లక్షలతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మేయర్ దృష్టికి డివిజన్ సమస్యలు



మాట్లాడుతున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో శేరిలింగంపల్లి డివిజన్‌లో స్ట్రీట్ లైట్లు, ఇతర సమస్యలను కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ మేయర్ గద్వాల విజయలక్ష్మి దృష్టికి తీసుకువచ్చారు. బుధవారం జరిగిన సమావేశంలో పలు సమస్యలను ఆయన ప్రస్తావించారు.

స్థలం కబ్జాకు యత్నించిన వారిపై కేసు నమోదు

చందానగర్: శేరిలింగంపల్లి మండల జర్నలిస్టులకు చందానగర్‌లో కేటాయించిన స్థలాన్ని కబ్జాకు యత్నించిన వారిపై బుధవారం చందానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ విజయ్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జర్నలిస్టులకు ఇచ్చిన భూమిలో కొంత మంది కడీలను ధ్వంసం చేశారని వారిపై కేసు నమోదు చేశామన్నారు. దర్యాప్తు చేసి కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యక్తి అదృశ్యం



మనోహర్ (ఫైల్)

మియాపూర్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జహీరాబాద్ మండలానికి చెందిన దాసరి మనోహర్ (50) కుటుంబ సభ్యులతో మియాపూర్ సాయిరాం టవర్స్‌లో నివాసముంటున్నాడు. నెల కిందట ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. కొన్ని రోజుల తర్వాత భార్యతో ఫోన్‌లో మాట్లాడి క్షేమంగా ఉన్నానని వెతకవద్దని తెలిపాడు. భర్త తనతో ఫోన్‌లో మాట్లాడుతుండేవాడని నాలుగు రోజులనుంచి ఫోన్ కలవడం లేదంటూ భార్య పోగమ్మ మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వీసీని సత్కరించిన పూర్వ విద్యార్థులు



వీసీ ఐనుల్‌హసన్‌ను సన్మానించిన పూర్వ విద్యార్థులు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్‌ను విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి నాసిర్‌హుస్సేన్ షోయబ్ నాయకత్వంలో సంఘం ప్రతినిధుల బృందం వైస్‌చాన్స్‌లర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇటీవలే పద్మశ్రీ అందుకున్న నేపథ్యంలో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉర్దూ సాహిత్యానికి హైదరాబాద్ చేసిన కృషిని ప్రశంసించారు. త్వరలో హిమాయత్ నగర్‌లోని ఉర్దూ హాల్‌లో మహిళల కోసం కాలిగ్రఫీ తరగతులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంసీజే అండ్ పీఆర్‌ఓ అసోసియేట్ ప్రొ.డాక్టర్ మహ్మద్ ముస్తఫా అలీ పాల్గొన్నారు.

విత్తన సంస్థలలో కనీస వేతనాలు అమలు చేయాలి



కనీస వేతనాల నివేదికను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఈసీహెచ్‌ఓ సంస్థ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

రాయదుర్గం: విత్తన సంస్థలలో కనీస వేతనాలు అమలు చేయాలని, అందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఈసీహెచ్‌ఓ (ఎనేబ్లింగ్ చైల్డ్ అండ్ హ్యూమన్ రైట్స్ విత్ సీడ్ ఆర్గనైజేషన్స్) ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో ఒయాసిస్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం విత్తన రంగ ప్రతినిధులతో సీడ్ సప్లై చెయిన్‌లో కనీస వేతనాలు అమలు అనే అంశంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో పలు చోట్ల విత్తనాల తయారీ సంస్థలలో పెద్ద సంఖ్యలో కార్మికులు పని చేస్తున్నారని వారికి ప్రభుత్వం నిర్దేశించిన రీతిలో కనీస వేతనాలు అమలు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కనీస వేతనాలపై రూపొందించిన నివేదికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈసీహెచ్‌ఓ అధ్యక్షుడు యూవీఎల్ ఆనంద, ఎఫ్‌సీఐఐ సలహాదారు డాక్టర్ రామ్ కొండిన్య, ఈస్ట్‌వెస్ట్ సీడ్స్ జనరల్ మేనేజర్ జీసీ శివకుమార్, వివిధ సంస్థల ప్రతినిధులు సురేష్‌కుమార్, గంగాధర్, శ్రీనివాస్, డి లింగయ్య, సతీష్‌హెగ్డే, శ్రీనివాస్, సుభద్రగుప్తా, మౌచుమి తదితరులు పాల్గొన్నారు.

వార్డుల డీలిమిటేషన్‌కు నోటిఫికేషన్ జారీ

ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి

పటాన్‌చెరు టౌన్: నూతనంగా ఏర్పడిన ఇస్నాపూర్ మున్సిపాలిటీలో వార్డుల విభజన, ఓటర్ల నమోదుకు నోటిఫికేషన్ విడుదలైందని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు..... రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వారం రోజుల్లో డీ లిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేసి, ముసాయిదా జాబితాను ప్రచురిస్తామన్నారు. ప్రజల నుంచి సలహాలు, సూచనలు, ఫిర్యాదులను తీసుకుని వాటిని పరిష్కరించి తుది జాబితాను ప్రచురిస్తామని చెప్పారు. ఇస్నాపూర్ పరిధిలో 12 వార్డులు, చిట్కుల్ 7 వార్డులు, పాశమైలారం 3 వార్డులు ఉన్నాయని ఆయన తెలిపారు. వార్డుల్లో నివాస గృహాలు, జనాభా, కులాల వారీగా స్త్రీలు, పురుషులు ఓటర్ల వివరాలను గెజిట్లో వెల్లడిస్తారని ఆయన పేర్కొన్నారు.

రేషన్ బియ్యం కోసం..



రాయదుర్గం: మూడు నెలల బియ్యం ఒకేసారి ఇస్తుండడంతో రేషన్ దుకాణం వద్ద జనం బారులు తీరారు. గచ్చిబౌలి డివిజన్ నానక్‌రాంగూడలోని రేషన్ దుకాణం నుంచి నానక్‌రాంగూడ వాసులే కాకుండా గౌలిదొడ్డి, గోపన్‌పల్లి తండావాసులు కూడా బియ్యం తీసుకెళ్ళే పరిస్థితి ఉండడంతో క్యూకట్టారు. సాంకేతిక ఆలస్యం జరుగుతున్నా ప్రజలు వేచి ఉంటున్న పరిస్థితి కనపడుతోంది.

డెలివరీబాయ్‌ల ముసుగులో గంజాయి సరఫరా

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-5లో పిల్లర్ నంబర్ 1558 వద్ద ఇద్దరు యువకులు గంజాయి విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కే వాసుదేవరావు ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అక్రమంగా గంజాయి సరఫరా చేస్తూ విక్రయించేందుకు యత్నిస్తుండగా వీరిని పట్టుకుని 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోట ప్రాంతానికి చెందిన పి.వినయ్‌కుమార్‌గౌడ్ (33) జెప్టోలో పనిచేస్తుండగా అదే ప్రాంతానికి చెందిన ఎస్.ఉదయ్‌కుమార్ (21) బిగ్ బాస్కెట్‌లో పనిచేస్తున్నాడు. వీరిద్దరూ డెలివరీ బాయ్‌ల ముసుగులో గంజాయి సరఫరా చేస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం..... మంగళవారం నిర్వహించిన డ్రైవ్‌లో 12 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఆరుగురికి రూ. వెయ్యి, ఆరుగురికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

పూడిక తీశారు.. వదిలేశారు..



శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఎదుట నాలాలో తీసిన పూడికను అక్కడే వదిలేసిన దృశ్యం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నాలా పూడికను అక్కడే వదిలేశారు. శేరిలింగంపల్లి హైస్కూల్ ముందు భాగంలోని నాలాలో ఉన్న పూడికను వారం రోజుల క్రితం తొలగించారు. గుట్టలుగా పోసి వదిలేయడంతో వర్షాలు కురిస్తే తిరిగి వ్యర్థాలు మొత్తం బ్రిడ్జి కిందకు చేరి డ్రైన్‌లోకి చేరే ప్రమాదం ఉందని, దానిని వెంటనే తొలగించేందుకు జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- డివిజన్ పరిధిలోని హుడా ట్రేడ్ ప్రధాన రోడ్డులో తాటికాయల వ్యర్థాలను అక్కడే వదిలేశారు. వర్షాలు కురిస్తే ఓపెన్‌డ్రైన్‌లో కలిసి ప్రమాదం ఉంది.
- నల్లగండ్ల కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న ప్రధాన రోడ్డులోని ఓపెన్ డ్రైన్‌లో తీసిన పూడిక ను వెంటనే తొలగించాలని స్థానికులు పేర్కొంటున్నారు.



హుడా ట్రేడ్ సెంటర్ ప్రధాన రోడ్డులో..



నల్లగండ్ల కూరగాయల మార్కెట్ ఎదురుగా ..